క్లుప్తంగా

రీ-సర్వే గ్రామ సభలను వినియోగించుకోవాలి

మొగల్తూరు: గ్రామాల్లో నిర్వహిస్తున్న రీసర్వే గ్రామ సభలను గ్రామస్తులు వినియోగించుకోవాలని తహసీల్దార్ కె.రాజకిషోర్ సూచించారు. గురువారం మొగల్తూరు 1వ సచివాలయ పరిధిలో నిర్వహించిన గ్రామ సభలో ఆయన మాట్లాడారు. మీ గ్రామంలో భూ-సమస్యలు లేక స్థల వివాదాలు లేక సరిహద్దు సమస్యలు, పేర్లు మార్పు తదితర సమస్యలుంటే లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయాలని సూచించారు. సంబంధిత వ్యక్తులకు నోటీసులు జారీ చేసి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. సభలో సర్పంచ్ పడవల మేరీ, సర్వేయర్ ధనరాజ్, డీటీ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ తీగలపై గుమ్మడి పాదుల తొలగింపు


సాకావారిపేటలో విద్యుత్ స్తంభాన్ని సరి చేస్తున్న దృశ్యం

సాక్షి స్పందన

పాలకొల్లు అర్బన్: మండలంలోని దిగమర్రు రాపాక వారి పేట, సాకా వారి పేటలో ఒరిగిన విద్యుత్ స్తంభాలను విద్యుత్ శాఖ అధికారులు నిలబెట్టారు. గురువారం సాక్షిలో 'విద్యుత్ తీగలపై గుమ్మడికాయలు' శీర్షికన ప్రచురితమైన వార్తకు ఎలక్ట్రికల్ ఏఈ ఎల్ శ్రీనివాసరావు స్పందించారు. సాకా వారిపేటలో ఒరిగిన స్తంభాన్ని ఎల్ఐ ఎస్.వెంకట్రావు తన సిబ్బందితో కలిసి నిలబెట్టి విద్యుత్ తీగలు సరిచేశారు. అలాగే కిందకి వేలాడుతున్న విద్యుత్ తీగలను కూడా సరిచేశారు. దీంతోపాటు రాపాక వారి పేటలో విద్యుత్ తీగలపై పాకిన గుమ్మడి పాదును తొలగించారు.

ఆరబెట్టిన ధాన్యాన్ని వెంటనే రైస్‌మిల్లులకు తరలించాలి


ఆలమూరులో రైతులతో మాట్లాడుతున్న రాహుల్‌కుమార్‌రెడ్డి

పెనుమంట్ర: వాతావరణ పరిస్థితులు సరిగ్గా లేనందున రైతులు కళ్లాల్లో, రోడ్లపైన ఆరబెట్టిన ధాన్యాన్ని వెనువెంటనే రైతు భరోసా కేంద్రాల ద్వారా రైస్ మిల్లులకు తరలించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి రైతులకు, స్థానిక అధికారులకు సూచించారు. గురువారం ఆయన పెనుమంట్ర మండలంలోని వివిధ గ్రామాలలో పర్యటించి రైతులు ఆరబెట్టిన ధాన్యాలను పరిశీలించారు. రైతులు తమ ధాన్యాలను తమకు ఇష్టమైన రైస్‌మిల్లులకు రవాణా చేసుకోవచ్చని, అధికారులతో సంప్రదించి ధాన్యాలను వారి సహకారంతో రైస్ మిల్లులకు తరలించుకోవాలని కోరారు. ఆయన వెంట ఇరగవరం తహసీల్దార్ ఎం.సుందరరాజు ఉన్నారు.

గవర కార్పొరేషన్ కమిటీలో మహిళలకు అన్యాయం


బొడ్డేటి సూర్యనారాయణ

పాలకొల్లు అర్బన్: గవర కార్పొరేషన్ నూతన కమిటీ నియామకంలో మహిళలకు కూటమి ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసిందని గవర కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ బొడ్డేటి సూర్యానారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గవర కార్పొరేషన్ నియామకంలో ఆరుగురు మహిళలకు అవకాశం కల్పించారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం రెండు రోజుల క్రితం ప్రకటించిన గవర కార్పొరేషన్ చైర్మన్, డైరెక్టర్లుగా 15 మందిని నియమించారని, అయితే వీరిలో ఒక్కరూ కూడా మహిళ లేకపోవడం విచారకరమని పేర్కొన్నారు. తెలుగుదేశం, జనసేన పార్టీలో గవర సామాజిక వర్గంలో మహిళలు కరువయ్యారా? అని ఆయన ప్రశ్నించారు.

మధుమేహంపై అవగాహన

నరసాపురం: మధుమేహం వ్యాధి విషయంలో ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని పట్టణానికి చెందిన ప్రముఖ షుగర్ వ్యాధి నిపుణుడు డాక్టర్ గోపాల్ కొల్లేపర సూచించారు. గురువారం వైఎన్ కళాశాలలో మైక్రోబయోలజీ, హెల్త్ అండ్ నర్సింగ్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో మధుమేహం, సూక్ష్మజీవి కారకాల ప్రమాదం అనే అంశంపై ఒకరోజు వర్క్‌షాపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ కొల్లేపర మాట్లాడుతూ చెక్కర వ్యాధిని అదుపులో పెట్టుకోకపోతే శరీరంపై దుష్ప్రభావం మరింత ఎక్కువగా ఉంటుందని చెప్పారు. ప్రిన్సిపాల్ సీహెచ్ కనకారావు, డీన్ గంధం రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పాలకొల్లులో..

పాలకొల్లు అర్బన్: ఆహార నియమాలు పాటించడం ద్వారా సుగర్‌ని అదుపులో ఉంచుకోవచ్చని ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ టి.కృష్ణ చెప్పారు. అంతర్జాతీయ మధుమేహ వ్యాధి దినోత్సవం సందర్భంగా గురువారం ఏఎస్ఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల ఎన్ఎస్ఎస్, రెడ్ రిబ్బన్ క్లబ్, శ్రీ విజయ డయాగ్నోస్టిక్ ల్యాబొరేటరీ సంయుక్త ఆధ్వర్యంతో సుగర్ వ్యాధి పరీక్షలు నిర్వహించారు.

వాతావరణ మార్పులతో రైతుల్లో ఆందోళన

ఆకాశం మేఘావృతం కావడంతో బెంబేలు


మొగల్తూరులో పంట చేతికొచ్చిన చేను


మొగల్తూరు కోట ప్రాంతంలో కోత కోస్తున్న చేను

మొగల్తూరు: గత నాలుగు రోజులుగా వాతావరణంలో మార్పులు కారణంగా రైతులు ఆందోళన చెందుతున్నారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం దెబ్బకు రెండురోజులుగా చెదురుమదురుగా వర్షాలు కురుస్తున్నాయి. అసలే తీరంలో సార్వా సాగు ఆలస్యమై పంట ఆలస్యంగా చేతికొస్తుందని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. మూలిగే నక్కపై తాటికాయ పడిన చందాన పంట చేతికొచ్చే సమయంలో వర్షాలు కురవడంతో రైతులు భయాందోళనలకు గురవుతున్నారు. ఇప్పటికే రెండు సార్లు ఆకుమడులు వేయడంతో అప్పులపాలయ్యామని, ఇప్పుడు పంట చేతికొచ్చే ఇదెక్కడి గండమని ఆందోళన చెందుతున్నారు.

ఆలస్యంగా నాట్లు

ఈ ఏడాది జూలై నుంచి ఆగస్టు వరకు వరుణుడు తన ప్రతాపం చూపించడంతో ఆకుమడులు మునిగిపోవడం లేదా నాట్లు వేసుకున్న చేలు ముంపునకు గురికావడంతో పెట్టిన పెట్టుబడి అంతా నష్టపోయారు. సెప్టెంబర్ నెలలో కానీ నాట్లు వేసుకోవడం పూర్తికాలేదు. దీంతో ఈ ఏడాది సార్వా సాగు చేపట్టలేమని కాళీపట్నం, కెపిపాలెం, పేరుపాలెంలో, మొగల్తూరు పంచాయతీలోని కొత్తకాయలతిప్ప, రామన్నపాలెంలోని 1 సచివాలయ పరిధిలోని ప్రాంతాలలో సాగు చేపట్టలేదు. ఉన్న కొద్దిపాటి భూముల్లో సాగు చేస్తున్న రైతులు ఈ తాజా వాతావరణ పరిస్థితులతో ఆందోళన చెందుతున్నారు.

640 ఎకరాలలోనే నాట్లు పూర్తి

ప్రతికూల వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ఈ ఏడాది అధికారులు అంచనా ప్రకారం కేవలం 640.06 ఎకరాల్లోనే రైతులు సాగు చేస్తున్నారు. అయితే ముందుగా నాట్లు వేసుకున్న చేలు పంట చేతికి రావడంతో సుమారు 15 ఎకరాలలో వరి కోతలు ప్రారంభమయ్యాయి. అయితే బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా గత నాలుగు రోజులుగా చెదురు మదురుగా వర్షాలు పడుతున్నాయి. దీంతో కోతకొచ్చిన చేలను ఒబ్బిడి చేసుకోవాలంటే వాతావరణం కారణంగా ఆందోళన చెందుతున్నారు. రామన్నపాలెం పంచాయతీలోని 2వ సచివాలయం పరిధిలో 201 ఎకరాలు, మొగల్తూరులోని కోట ప్రాంతంలోను ముందుగా ఊడ్చిన చేలు కోతకు రావడంతో ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకునేందుకు రైతులు సిద్ధమయ్యారు. అయితే వాతావరణ మార్పులతో వెనుకడుగు వేస్తున్నారు. ఓ పదిహేను రోజుల పాటు వాతావరణ కరుణిస్తే కనీసం పెట్టుబడులైనా చేతికి వస్తాయని రైతులు చెబుతున్నారు.

ఆందోళన చెందుతున్నాం



మా గ్రామంలో రైతులు వ్యవసాయంపైనే ఆసక్తి చూపేవారు. అయితే జున్నూరు కాలువ శివారు ప్రాంతంలో తమ భూములుండటంతో సాగు నీరు అందడం ఇబ్బందికరంగా మారడంతో సాగుపనులు ఆలస్యమైంది. అయితే వాతావరణం అనుకూలించడంతో మరి కొద్ది రోజుల్లో పంట చేతికొచ్చే సమయంలో తిరిగి వర్షాలు కురుస్తుండటంతో ఆందోళన చెందుతున్నాం.

– గూడూరి మావుళ్లు, పాలకమ్మచెరువు, శేరేపాలెం పంచాయతీ

బాలలకు క్రమశిక్షణ అలవాటు చేయాలి


నరసాపురం: విజేతలకు బహుమతులు అందిస్తున్న జడ్జి విజయదుర్గ


పెనుగొండ: అంగన్‌వాడీ కేంద్రంలో బాలల దినోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం


పాలకొల్లు అర్బన్: దిగమర్రులో నెహ్రూ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం


పెనుమంట్ర: మార్టేరు ఎస్వీజీ పాఠశాలలో మాట్లాడుతున్న హెచ్ఎం సూర్యనారాయణరెడ్డి

నరసాపురం: బాలలకు మంచి క్రమశిక్షణ అలవాటు చేయాలని నరసాపురం 10వ అదనపు జిల్లా జడ్జి పి.విజయదుర్గ అన్నారు. గురువారం మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక నాయిపేట ఎస్ఎల్ఎస్ ప్రభుత్వ పాఠశాలలో బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. ముందుగా జడ్జి చాచా నెహ్రూ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి జి.గంగరాజు, హెచ్ఎం సుధీర్‌బాబు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సీహెచ్ బాలాజీ, చల్లా దానయ్యనాయుడు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని సూర్యా ఇంగ్లిష్ మీడియం స్కూల్లో నిర్వహించిన బాలల దినోత్సవంలో విద్యార్థులు జాతీయనాయకుల వేషధారణలతో అలరించారు.

మొగల్తూరులో...

మొగల్తూరు: బాలల దినోత్సవాన్ని గురువారం మండలంలోని ఘనంగా నిర్వహించారు. వారతిప్ప ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులు నృత్యాలతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో కారాడి ఫణికుమార్, హెచ్ఎం సీహెచ్ సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

బాలలే దేశానికి భవిష్యత్

పెనుగొండ: నేటి బాలలే రేపటి పౌరులని, ఉజ్వల భవిష్యత్‌కు వారే పునాది అని మహిళా కమిషన్ సభ్యురాలు బూసి వినీత అన్నారు. గురువారం బాలల దినోత్సవం సందర్భంగా పెనుగొండలో అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. అంగన్‌వాడీ కేంద్రంలో అందిస్తున్న సదుపాయాలను పరిశీలించారు. సక్రమంగా నిర్వహణ చేయాలని సూచించారు. కార్యక్రమంలో పెనుగొండ సర్పంచ్ నక్కా శ్యామలా సోనీ శాస్త్రి, సీడీపీఓ ఎ.కృష్ణకుమారి, ఐసీడీఎస్ సూపర్‌వైజరు జి.సుజాత పాల్గొన్నారు. అలాగే పెనుగొండలో చైతన్య టెక్నో పాఠశాల, భాష్యం, ఆక్స్‌ఫర్డు, ఇన్‌ఫెంట జీసస్ పాఠశాలల్లో బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు.

సీతారాంపురంలో..

నరసాపురం రూరల్: ప్రతి ఒక్కరూ విద్యార్థి దశ నుండే క్రమశిక్షణను అలవర్చుకోవడం ద్వారా ఉన్నత స్థితికి చేరుకోవచ్చనని నరసాపురచార్జ్రీడీఓ దాసి రాజు అన్నారు. గురువారం సీతారామపురం జె.బీర స్కూల్, బీఈడీ కళాశాలల ప్రాంగణంలో నిర్వహించిన బాలల దినత్సోవ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ బాలల హక్కులు కోసం ఐక్యరాజ్యసమితి ప్రత్యేక చట్టాన్ని తీసుకుచ్చిందన్నారు. కార్యక్రమంలో జోసఫ్ బీర, డైరెక్టర్ ఫిన్నీ బీర పాల్గొన్నారు.

దిగమర్రులో..

పాలకొల్లు అర్బన్: మాజీ ప్రధాని పండిట్ జవహార్‌లాల్ నెహ్రూకి బాలలంటే ఎంతో ఇష్టమని ఈ కారణంగా ఆయన జయంతిని జాతీయ బాలల దినోత్సవంగా ప్రకటించారని పాఠశాల హెచ్ఎం కోట శ్రీనివాస్ అన్నారు. గురువారం దిగమర్రు జెడ్పీ ఉన్నత పాఠశాలలో బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు షేక్ పీర్ సాహెబ్, చిలుకూరి పద్మశ్రీదేవి, వలవల రాజేశ్వరి, గొల్లమందుల రాజు పాల్గొన్నారు. అలాగే యునైటెడ్ కాపు వనిత సర్వీస్ ఆర్గనైజేషన్ క్యాలెండర్ ఈవెంట్స్‌లో భాగంగా గురువారం పట్టణంలోని బ్యాంక్ కాలనీలో ఉన్న ఎస్ఎస్ఎన్ మునిసిపల్ ప్రైమరీ స్కూల్‌లో బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం అందే విజయ దుర్గ, క్లబ్ అధ్యక్షురాలు యామన విజయ లక్ష్మి, కార్యదర్శి దేవరపు కాంచనమాల పాల్గొన్నారు.

మార్టేరులో..

పెనుమంట్ర: మండలంలోని మార్టేరు ఎస్వీజీ స్కూల్‌లో గురువారం బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం చిర్ల సూర్యనారాయణరెడ్డి నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన సేవల గురించి విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి మధ్యాహ్న భోజనంలో స్వీట్స్, బజ్జీలు అదనంగా వేసి మధ్యాహ్న భోజనాన్ని వడ్డించారు. అనంతరం వివిధ పోటీల్లో విజేతలకు దాత వెలగల అమ్మిరెడ్డి సహకారంతో బహుమతులు అందజేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నరసాపురం రూరల్: మండలంలోని సీతారామపురం ఫీడర్ పరిధిలో ట్రీ కట్టింగ్ నిమిత్తం పీచుపాలెం, లక్ష్మణేశ్వరం, దర్బరేవు, రాజుల్లంక గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఎలక్ట్రికల్ ఈఈ కె.మధుకుమార్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ ఆయా గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

పాలకొల్లులో..

పాలకొల్లు అర్బన్: మండలంలోని లంకలకోడేరు 33/11కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు సాంకేతిక మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఎలక్ట్రికల్ ఈఈ కె.మధుకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. లంకలకోడేరు, బల్లిపాడు, శివదేవునిచిక్కాల, దగ్గులూరు, వెంకటాపురం, గవరపేట, పాలమూరు, అరట్లకట్ట గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

17న స్వర్ణోత్సవ కార్తీక వన సమారాధన

పెనుగొండ: వేమన రెడ్డి యువజన సంఘం ఆధ్వర్యంలో పెనుగొండలో స్వర్ణోత్సవ కార్తీక వన సమారాధన ఈ నెల 17న నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఆదివారం పెనుగొండలోని లక్ష్మీ జనార్ధన స్వామి కల్యాణమండపంలో వనసమారాధన నిర్వహిస్తామన్నారు. ఉదయం 8.30 నిముషాలకు కొవ్వూరి పద్మనాభరెడ్డి, వెంకటలక్ష్మీ దంపతులతో శ్రీతులసీ ధాత్రీ సమేత కార్తీక దామోదర పూజలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

బాధితులకు ఆర్థిక సాయం

పాలకొల్లు అర్బన్: విద్య, వైద్య, సామాజిక రంగాలకు వసుధ ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకట్రామరాజు చేస్తున్న సేవలు అభినందనీయమని కాస్మో కల్చరల్ స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు గొట్టుముక్కల గాంధీభగవాన్‌రాజు అన్నారు. మొగల్తూరు మండలం ములపర్రుకి చెందిన తిరుమాని సాన్విత అనే ఆరేళ్ల బాలిక ప్రమాదవశాత్తు పొయ్యి దగ్గర బట్టలకు నిప్పు అంటుకుని తీవ్రంగా గాయపడింది. బాలిక పరిస్థితిపై స్పందించిన వెంకట్రామరాజు రూ.20 వేల చెక్కును ఫౌండేషన్ కన్వీనర్ పెన్మెత్స బుద్ధరాజు ద్వారా కాస్మోక్లబ్‌లో గురువారం బాలిక తండ్రి తిరుమాని నాగరాజుకి అందజేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి వేగిరాజు వెంకట సోమరాజు, క్షత్రియ సంక్షేమ పరిషత్ ఉపాధ్యక్షుడు చేకూరి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు జిల్లా నీటి పారుదల సలహా మండలి సమావేశం

భీమవరం(ప్రకాశంచౌక్): జిల్లా నీటి పారుదల సలహా మండలి సమావేశాన్ని శుక్రవారం ఉదయం 11 గంటలకు గంటలకు భీమవరం కలెక్టర్ కార్యాలయం మీకోసం సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు జిల్లా జల వనరులశాఖ అధికారి పి.నాగార్జునరావు తెలిపారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు.

గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి


నరసాపురం రూరల్: శిక్షణ పొందిన వారితో ఎంపీడీఓ రామకృష్ణంరాజు


పాలకొల్లు అర్బన్: శిక్షణ తరగతుల్లో పాల్గొన్న అధికారులు

నరసాపురం రూరల్: గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మంజూరు చేసిన నిధులను సకాలంలో వినియోగించి మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేయాలని రీసోర్స్ పర్సన్ బుర్రా ఆనందబాబు అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో వివిధ శాఖల మండలస్థాయి అధికారులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్రాల నుంచి వచ్చే నిధులను ముందుగా తయారు చేసుకున్న ప్రణాళికల ప్రకారం ఖర్చు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గాదిరాజు రామకృష్ణంరాజు, ఈఓపీఆర్డీ కాకర్లమూడి నాగేంద్ర కుమార్‌బాబు, కార్యాలయ సూపరింటెండెంట్ కె.వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

పాలకొల్లులో..

పాలకొల్లు అర్బన్: గ్రామాభివృద్ధికి నిర్దేశించిన లక్ష్యాలను ప్రతి ఒక్కరూ సాధించాలని ఎంపీడీఓ ఎన్ఎన్ ఉమామహేశ్వరరావు కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై నిర్వహించిన శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు. మాస్టర్ ట్రైనీ, ఈఓపీఆర్డీ తాళ్ల మూర్తిబాబు మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి నిర్దేశించిన పేదరికం లేని మెరుగైన జీవనోపాధి కల్పించడం, ఆరోగ్యకరమైన గ్రామంగా తీర్చిదిద్దడం వంటి లక్ష్యాలను అధిగమించాలని కోరారు. ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు, మాస్టర్ ట్రైనీలు శివరామకృష్ణ, నాగయ్య, ఏపీఎం బీవీఆర్ ఆచార్యులు తదితరులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ హామీలను అమలు చేయాలి


పెనుమంట్ర: తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు


పెనుగొండ: తహసీల్దారు కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

పెనుమంట్ర: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజలపై మోపుతున్న భారాలను తక్షణమే నిలిపివేసి ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలను అమలు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి కూసంపూడి సుబ్బరాజు డిమాండ్ చేశారు. సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో గురువారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కోయి శ్రీనివాసప్రసాద్, కుడిపూడి నాగేశ్వరరావు, పిల్లి రాజారావు, ఇందుకూరి వెంకటరాజు తదితరులు పాల్గొన్నారు.

పెనుగొండలో..

పెనుగొండ: విద్యుత్ ట్రూ అఫ్ చార్జీలు ప్రభుత్వమే భరించాలని సీపీఎం మండల కార్యదర్శి షేక్ పాదుషా డిమాండ్ చేశారు. ప్రజా పోరు నిర్వహించిన అనంతరం సీపీఎం ఆధ్వర్యంలో పెనుగొండ తహసీల్దారు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి తహసీల్దారు జి.అనితకుమారికి గురువారం వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు నాగిశెట్టి గంగారావు, కప్పల రత్నరాజు, నీలాపు ఆదినారాయణ, పులిదిండి రామారావు, మాదాసు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఆచంటలో

అధిక ధరలు, నిరుద్యోగం, మహిళలు, పిల్లలు, దళితులపై అత్యాచారాలు, జమిలి ఎన్నికలు, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సీపీఎం పార్టీ ప్రజాపోరు నిర్వహించి ఆచంట తహసీల్దారు జి.కనకరాజుకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కేతా గోపాలన్, సిర్రా నరసింహమూర్తి, బండి రంగారావు, తలుపూరి బుల్లాబ్బాయి, తోటపల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.

గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలు


నరసాపురం: గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభిస్తున్న దృశ్యం


పాలకొల్లు అర్బన్: జిన్నూరులో గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహిస్తున్న దృశ్యం

నరసాపురం: గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలు అని డీఎస్పీ ఎన్‌బీఎం మురళీ కృష్ణ అన్నారు. స్థానిక గ్రేడ్-1 శాఖా గ్రంథాలయంలో గురువారం గ్రంథాలయ వారోత్సవాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా యాన మాట్లాడుతూ ప్రజలను విజ్ఞాన వంతులుగా తీర్చిద్దిదడంలో గ్రంథాలయాల పాత్ర మరువలేనిదని చెప్పారు. నెహ్రూ జయంతి సందర్భంగా విద్యార్థులకు నెహ్రూ అంశాలపై వివిధ డిబేట్, చిత్రలేఖనం తదితర పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య, లైబ్రేరియన్ కేజేఎస్ఎల్ కుమారి, పండా త్రినాథ్, సీహెచ్ రెడ్డప్ప దవేజీ తదితరులు పాల్గొన్నారు. అలాగే వైఎన్ కళాశాలలో 57వ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. గ్రంథాలయ అధికారి జి.కోటయ్య, ప్రిన్సిపాల్ సీహెచ్ కనకారావు తదితరులు పాల్గొన్నారు.

కొప్పర్రులో..

నరసాపురం రూరల్: విజ్ఞాన సముపార్జనకు మంచి పుస్తకాన్ని మించిన మిత్రుడు లేడని ప్రముఖ సీనియర్ వైద్యుడు వైఎన్ కళాశాల అధ్యాపకుడు డాక్టర్ చినమిల్లి సత్యనారాయణ అన్నారు. గ్రంథాలయ వారోత్సవాలను కొప్పర్రు పుస్తక పంపిణీ కేంద్రం ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ హైస్కూల్ ఆవరణలో గురువారం ఘనంగా నిర్వహించారు. రీడర్స్‌ఫోరం అధ్యక్షులు పోలిశెట్టి రమేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సర్పంచ్ నల్లి వరలక్ష్మి, హైస్కూల్ పేరెంట్స్ కమిటీ చైర్మన్ కొండ, హెచ్ఎం చామకూరి రాంబాబు, ఎంపీటీసీ సభ్యుడు పత్తి సంపూర్ణ, చినమిల్లి వీరబాబు, కుంకటి శేఖర్ పాల్గొన్నారు.

పెనుమంట్రలో..

పెనుమంట్ర: 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను మార్టేరు గ్రంథాలయం వద్ద మానవత సంస్థ అధ్యక్షుడు కర్రి కృష్ణారెడ్డి అధ్యక్షతన జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ప్రారంభించారు. తొలిరోజు బాలల దినోత్సవం, పుస్తక ప్రదర్శన కార్యక్రమాలను నిర్వహించారు, ఈనెల 14 నుండి 20వ తేదీ వరకు గ్రంథాలయం వద్ద విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి 20న మానవత సంస్థ ఆధ్వర్యంలో బహుమతులు అందజేయనున్నట్లు గ్రంథాలయ అధికారి పీటీఎస్ కుమార్ తెలిపారు.

జిన్నూరులో..

పాలకొల్లు అర్బన్: మండలంలోని జిన్నూరు శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా గురువారం విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. గ్రంథ పాలకురాలు, ఉపాధ్యాయుడు జామాను రామలక్ష్మణ్, ఉపాధ్యాయులు రాణి, సీఆర్‌పీ భారతి పాల్గొన్నారు.

ట్రైనీ ఐఏఎస్‌ల పర్యటన


శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి సన్నిధిలో ట్రైనీ ఐఏఎస్‌లు

పాలకొల్లు అర్బన్: పంచారామక్షేత్రంగా ప్రసిద్ధి చెందిన శ్రీక్షీరారామలింగేశ్వర స్వామిని గురువారం ట్రైనీ ఐఏఎస్‌లు దర్శించుకున్నారు. ఆలయ ఈఓ ముచ్చర్ల శ్రీనివాసరావు, అర్చకస్వాములు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. క్షేత్రపాలకుడు శ్రీ జనార్దన స్వామి, శ్రీ పార్వతీ, శ్రీ లక్ష్మీదేవిలను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కల్యాణ మండపంలో ట్రైనీ ఐఏఎస్‌లకు వేద ఆశీర్వచనాలు అందజేసి స్వామివారి చిత్రపటాలను, ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జక్కంపూడి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పేరుపాలెంలో..

మొగల్తూరు: ట్రైనీ ఐఏఎస్‌ల బృందం గురువారం పేరుపాలెం బీచ్‌లో పర్యటించింది. బీచ్‌కు చేరుకున్న బృందం కాసేపు అతిథి గృహంలో సేదతీరి అనంతరం తీరం వెంబడి పర్యటించి ఉత్సాహంగా గడిపారు. వారి వెంట ఆర్డీఓ దాసి రాజు, తహసిల్దార్ రాజకిషోర్, ఆర్ఐ నిరంజన్, ఎంపీడీఓ త్రిశూలపాణి ఉన్నారు.

ప్రకటన

నా క్లయింట్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ నరసాపురం బ్రాంచి వారు నాకిచ్చిన వంజాయిషీ ప్రకారం తెలియజేయునది ఏమనగా ఈ క్రింది షెడ్యూల్ దాఖలా ఆస్తిని శ్రీమతి కామాడి రేణుక భర్త శ్రీనివాస్ మార్టిగేజ్ చేయడానికి అంగీకరించారు. సదరు ఆస్తిపై ఏ విధమైన అభ్యంతరాలు ఉన్నా ఈ ప్రకటన వెలువడిన వారం రోజులలో తెలియజేయవలెను. తదుపరి వచ్చిన అభ్యంతరములు స్వీకరించ బడవు. మొగల్తూరు సబ్ రిజిస్ట్రార్ డాక్యుమెంట్ నం 1876/2023, ఆర్.యస్.నం. 768/8ఏ లో 198.6 చ.గ.మొగల్తూరు మండలం మొగల్తూరు గ్రామానికి చెందిన స్థలానికి హద్దులు తూర్పు-ఉమ్మడి దారి మరియు నాగులమండ పద్మనాభరావు స్థలం, పడమర-[illegible], ఉత్తరం-[illegible] వెంకట రాము స్థలం, దక్షిణం-కుక్కల శ్రీలక్ష్మీ వెంకట సుబ్రహ్మణేశ్వరి స్థలం.
పి.డి.యస్.వి.బాలాజీ, బి.కాం.,బి.ఎల్., అడ్వకేటు, పాలకొల్లు. సెల్: 94904 33732

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నరసాపురం డివిజన్
90102 23729 (ఆచంట)
90102 01609 (నరసాపురం)
95055 07552 (పాలకొల్లు)
Office mail : tpgadvt@gmail.com